క్లుప్తంగా

అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

చండూరు: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో చండూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పోటీ చేస్తామని మండల అధ్యక్షుడు నేరెళ్ల ప్రభుదాస్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో అన్ని కౌన్సిలర్ల స్థానాల్లో కూడా బరిలో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కడారి సైదులు యాదవ్, చిలక రాజు శివ, మాణిక్యం, అన్నెపాక శంకర్, నల్లగంటి మల్లేశం, కురుపాటి సామ్రాట్ కిరణ్, పోలె రమాశంకర్, శోభన్, మహేష్, పులకరం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లూమ్ కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలి

నల్లగొండటౌన్: జిల్లాలోని పవర్‌లూమ్ కార్మికులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు తెలంగాణ పవర్‌లూమ్ కార్మికుల యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ముశం రమేష్, కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కోశాధికారి దండంపల్లి సత్తయ్య, కోడెం రమణ, గండి నాగరాజు, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్‌గా నూక కిశోర్‌యాదవ్



శాలిగౌరారం: తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్‌గా మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన నూక కిశోర్‌యాదవ్ ఎంపికయ్యారు. గ్రామంలో ప్రాథమిక విద్య పూర్తిచేసిన కిశోర్ యాదవ్ నకిరేకల్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. హైదరాబాద్‌లోని టీకేఆర్ కళాశాలలో ఎంబీఏ, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో న్యాయవాద విద్యను పూర్తిచేశారు.

'విశ్వకర్మ యోజన'ను ఉపయోగించుకోవాలి

మర్రిగూడ: కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ పిట్టల శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 10 లక్షలకు పైగా చేతివృత్తుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందని, రూ.3 లక్షల వరకు 25 పైసల వడ్డీతో రుణం పొందే అవకాశం ఉందని తెలిపారు. నియోజకవర్గానికి 1000 మందికి ఈ రుణాలను అందించి స్వశక్తితో ఎదిగే విధంగా చొరవ చూపడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. జల్లాకుల సైదులు, రాజేందర్ నాయక్, జిల్లా కిశోర్, గ్యార యాదగిరి, బోయపల్లి రాజు, గ్యార రామలింగం, శ్రీనివాస్, పంగా యాదయ్య, రాము పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మునుగోడు: మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మందుల చంద్రయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు చందాలు వేసుకుని రూ. 15వేల నగదు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పరి యాదగిరి, పీఏసీఎస్ డైరెక్టర్ నన్నూరి శేఖర్ రెడ్డి, దర్శనం లింగయ్య, జిట్టబోయిన నర్సింహ, రేగట్టె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీరేశాన్ని కలిసిన నాయకులు

నకిరేకల్: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజా రమేష్, నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుండా జలందర్‌రెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నేతలు సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుడిగ స్వామి, బొంబాయి శ్రీను, చిక్కుల శివ, బండారి ఆనంద్, బైరెడ్డి భాస్కర్‌రెడ్డి, కాపుగంటి నరేష్, మేడబోయిన నాగరాజు ఉన్నారు.

జ్యోతిష్య పండితుడు లక్ష్మణమూర్తికి అవార్డు

శాలిగౌరారం : ప్రముఖ జ్యోతిష్య పండితుడు డాక్టర్ శేషభట్టర్ లక్ష్మణమూర్తి విశిష్ట 'మహర్షి జైమిని సన్మాన్–2023 'అవార్డును అందుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినిలో గల విక్రమ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరిగిన అంతర్జాతీయ జ్యోతిష్య మహాదివేశన్ అంతర్జాతీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉజ్జయిని మేయర్ ముఖేశ్ తత్వాల్, మున్సిపాలిటీ చైర్మన్ కౌసల్యాదేవి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు.

ప్రాజెక్టులు పూర్తిచేసే బాధ్యత తీసుకుంటా

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మంత్రి పదవి చేపట్టిన తర్వాత మొదటిసారిగా నల్లగొండకు..
- మర్రిగూడ బైపాస్ వద్ద వేలాది మంది కార్యకర్తల ఘన స్వాగతం
- ఎన్జీ కాలేజీ వరకు భారీ ర్యాలీ
- హెలికాప్టర్‌తో పూల వర్షం



నల్లగొండలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పుష్పగుచ్ఛం అందిస్తున్న వంగాల అనిల్ రెడ్డి



స్వాగతం పలుకుతున్న ఎస్పీ

నల్లగొండ: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి నల్లగొండకు వచ్చిన సందర్భంగా సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నల్లగొండ పట్టణ సమీపంలోని మర్రిగూడ బైపాస్ రోడ్డు వద్దకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి నీరాజనాలు పలికారు. బాణసంచా కాలుస్తూ డప్పు చప్పుళ్లతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైపాస్ వద్ద బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు మంత్రి పూల మాలలు వేశారు. అక్కడి నుంచి రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి ర్యాలీగా ఎన్జీ కళాశాల వరకు వచ్చారు. ఈ సందర్భంగా హెలికాప్టర్ ద్వారా పైనుంచి మంత్రిపై పూల వర్షం కురిపించారు. గజమాలలతో మంత్రిని సన్మానించారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అత్యంత అద్భుతంగా అభివృద్ధి చేసి మిగతా నియోజకవర్గాల వారు వచ్చి చూసేవిధంగా తయారు చేస్తానన్నారు. నల్లగొండను గంజాయి, రౌడీలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రభుత్వం డ్రగ్స్, బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపనుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రౌడీయిజం, భూకబ్జాలు, ఇసుక దందాలు కొనసాగవన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, ఆరు గ్యారంటీలతో అభివృద్ధి చేస్తామన్నారు. ఇళ్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకుంటామన్నారు. డిసెంబరు 28న కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు పథకాలను ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, గడ్డం అనూప్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్, పాశం సంపత్‌రెడ్డి, జూకూరి రమేష్, మనిమద్దె సుమన్, సురెడ్డి సరస్వతి, నాంపల్లి భాగ్య, పలువురు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బి. వెల్లంల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు శంకుస్థాపన చేసిన బి.వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టు మళ్లీ కాంగ్రెస్ పాలనలోనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తేనే తన లక్ష్యం నెరవేరుతుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి నల్లగొండకు వెళ్తూ నార్కట్‌పల్లిలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నిజాం కాలం నుంచి కొనసాగుతున్న నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోకు పూర్వ వైభవం తీసుకువస్తానని అన్నారు. నార్కట్‌పల్లి–మునుగోడు, నార్కట్‌పల్లి–అమ్మనబోలు రోడ్డు విస్తరణ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దైద రవీందర్, మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, ఎంపీటీసీలు పాశం శ్రీనివాస్‌రెడ్డి, ఉండ్ర భాగ్యమ్మ లింగారెడ్డి, సర్పంచ్‌లు దూదిమెట్ల స్రవంతి, చంద్రశేఖర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డికి సత్కారం

చిట్యాల: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సోమవారం చిట్యాల మండలం తాళ్ళవెల్లెంల సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య కలిసి శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేశారు. వారివెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

కోమటిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు అధికారులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

నల్లగొండ: మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తొలిసారి నల్లగొండకు రావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీశ్రేణులు, మత పెద్దలు, ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మంత్రికి కలెక్టర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, ఎస్పీ అపూర్వరావు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేఖల భద్రాద్రి ఆధ్వర్యంలో పాస్టర్లు మోజెస్, ఇతర చర్చి పెద్దలు పుష్పగుచ్ఛం అందించి ప్రార్థనలు చేశారు.



ర్యాలీలో అభివాదం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతాం

చిట్యాల: జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులతోపాటు ఇతర అభివృద్ధి, నిర్మాణ పనుల్లో వేగం పెంచి పూర్తి చేస్తామని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్న అనంతరం సోమవారం మొదటిసారిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి చిట్యాలకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనకు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చిట్యాల పట్టణంలో జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మాణానికి జనవరిలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పదిహేను రోజుల్లో పనులను ప్రారంభిస్తామన్నారు. భువనగిరి నుంచి చిట్యాల వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు పోకల దేవదాసు, కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాటం వెంకటేశం, మాజీ జెడ్పీటీసీ శేపూరి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, సర్పంచ్‌లు అంతటి వెంకటేష్‌గౌడ్, జనగాం రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీలు ఎద్దులపురి కృష్ణ, ఎస్‌కే. ఇబ్రహీం, బొబ్బల రాంరెడ్డి, ఏనుగు రఘుమారెడ్డి, పోకల అశోక్, కోసనం అశోక్ పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణం పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపించాలని మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ప్రాంతం, పెద్ద గడియారం సెంటర్, మర్రిగూడ జంక్షన్, భాస్కర్ టాకీస్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్షన్ల వద్ద ప్రతి రోజు శుభ్రం చేయాలని, వీధుల్లో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాఅలీ, శంకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మనిమద్దె పాఠశాలలో పద్యార్చన

శాలిగౌరారం: మండలంలోని మనిమద్దె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం చిగురుమళ్ళ శ్రీనివాస్ రాసిన అమ్మ నాన్న గురువు పద్యార్చన చేశారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం ×తానా×తోపాటూ 100 దేశాల సమన్వయంతో ×వందే విశ్వమాతరం×పేరుతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు సామూహికంగా ఈ పద్యార్చన చేస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. పద్య సమన్వయకర్త మారోజు వెంకటాచారి, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు సైదులు, వెంకట్‌రెడ్డి, సైదయ్య పాల్గొన్నారు.

కరాటేలో కేజీబీవీ విద్యార్థి ప్రతిభ



ఆమని(కుడివైపు వైట్ డ్రెస్‌లో ఉన్న బాలిక)

కట్టంగూర్: జాతీయ స్థాయి అండర్–14 కరాటే పోటీల్లో కట్టంగూర్‌లోని కేజీబీవీ విద్యార్థిని ఎల్.ఆమని ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించింది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16తేదీ నుంచి ఢిల్లీలో కొనసాగుతున్న జాతీయ స్థాయి అండర్–14 బాలికల విభాగం కరాటే పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొన్న ఆమని.. తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించింది. ప్రతిభ కనబర్చిన ఆమనిని నల్లగొండ జిల్లా జపాన్ కరాటే అసోసియేషన్ ప్రతినిధులు, పాఠశాల యాజమాన్యం అభినందించింది.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

చిట్యాల: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. సోమవారం చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పీఎం విశ్వకర్మ యోజన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి విస్తృత ప్రచారం చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పదమూడు వేల కోట్ల రూపాయల నిధులతో ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకాన్ని కుల, చేతి వృత్తిదారులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు నకిరేకంటి మొగులయ్య, మాస శ్రీనివాస్, కన్నెబోయిన మహాలింగం, పొట్లపల్లి నర్సింహగౌడ్, గుండాల నరేష్‌గౌడ్, గంజి గోవర్ధన్ పాల్గొన్నారు.

దళిత బంధు యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి



ధర్నా చేస్తున్న దళితబంధు సాధన కమిటీ నాయకులు

నల్లగొండ టౌన్: గత ప్రభుత్వం దళిత బంధు పథకానికి ఎంపిక చేసి ప్రొసీడింగ్‌లు అందజేసిన వారందకీ యూనిట్‌లను గ్రౌండింగ్ చేయాలని దళితబంధు సాధన కమిటీ నాయకులు పాలడుగు నాగార్జున, బకరం శ్రీనివాస్, అద్దంకి రవి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నియోజకవర్గ పరిధిలో 1050 మందిని దళిత బంధు పథకానికి ఎంపిక చేసి ప్రొసీడింగ్‌లు కూడా అందజేశారన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రౌండింగ్ నిలిచిపోయిందన్నారు. ఎన్నికలు ముగిసినందున దళితబంధు యూనిట్‌లను గ్రౌండింగ్ చేసి దళితులకు చేయూతనివ్వాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కత్తుల జగన్ కుమార్, కందుల లక్ష్మయ్య, బొజ్జ వెంకన్న, బడుపుల శంకర్, తలారి, పరమేష్, ఆరెకంటి నర్సింహ, ఆంజనేయులు, కొండల్, జానయ్య అంజయ్య, సైదులు, శ్రీనివాస్, అశోక్, శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు



కౌన్సిలర్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టూటౌన్: బీఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు సోమవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో నలుగురు కౌన్సిలర్లకు మంత్రి కోమటిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా ఏర్పుల తర్షణ, పేర్ల జానయ్య గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచే గెలిచారు. తర్షణ అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరగా తిరిగి సొంత గూటికి చేరుకుంది. అదేవిధంగా మారగోని నవీన్‌కుమార్‌గౌడ్, మాతంగి సత్యనారాయణ బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరారు. వీరిద్దరు కూడా గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్లుగా గెలిచినవారే. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీం, సమ్మద్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నల్లగొండటౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. సంవత్సర కాలంగా వేతనాలు లేక గ్రామ పంచాయతీ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, పోతెపాక వినోద్‌కుమార్, పగిడిమర్రి సర్వయ్య, నీల ఆంజనేయులు, కొండేటి నర్సయ్య, నరేష్, యాదయ్య ఉన్నారు.

నూతన మండలంలో సౌకర్యాలు ఏవీ!

- నామమాత్రంగా పోలీస్ శాఖ సేవలు
- మిగతా శాఖలకు పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న గట్టుప్పల్ మండల ప్రజలు



గట్టుప్పల్‌లోని పోలీస్ స్టేషన్

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్‌ను గత ఏడాది అక్టోబర్ 2న ప్రభుత్వం నూతన మండలంగా ప్రకటించింది. ఏడాది దాటినా నూతన మండలంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. దీంతో మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలం ఏర్పాటుతో దూరభారం తగ్గుతుందనుకున్న ప్రజలకు సమస్యలు తప్పడం లేదు. గట్టుప్పల మండల కేంద్రంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడం ఓ సమస్య అయితే.. ఉన్న పోలీస్ శాఖకు పూర్తి అధికారాలు ఇవ్వకపోవడం మరో సమస్యగా మారింది.

రెవెన్యూ, పోలీస్ కార్యాలయాల ఏర్పాటు..

గట్టుప్పల్‌ను 7 గ్రామాలతో కలిపి ప్రభుత్వం అక్టోబర్ 2, 2022న నూతన మండలంగా ఏర్పాటు చేసింది. మునుగోడు మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామం చండూరు మండల పరిధిలోని తేరట్‌పల్లి, ఖమ్మగూడెం, శేరిగూడెం, మర్రిగూడ మండలం నుంచి నామాపురం, అంతంపేట, సోమరాజుగూడ గ్రామాలు గట్టుప్పల్ మండలంలో ఉన్నాయి. మొత్తంగా 15,100 మంది ఓటర్లు ఉన్నారు. అదే రోజు గట్టుప్పల్‌లో రెవెన్యూ కార్యాలయంతో పాటు పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. రెవెన్యూ కార్యాలయానికి మాత్రం అన్ని అధికారాలు ఇచ్చారు కానీ సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రజలకు సమయానికి పనులు కాక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారే గానీ గెజిట్ ఇవ్వకపోవడంతో ఫిర్యాదు ఇక్కడ స్వీకరించి దర్యాప్తులు మాత్రం పాత మండలం స్టేషన్ వారు చేస్తున్నారు. స్టేషన్‌లో ఒక ఎస్ఐని మాత్రమే నియమించారు. పోలీస్ సిబ్బందిని కేటాయించలేదు. సిబ్బంది దశలవారీగా సర్కిల్ పరిధిలోని ఆయా మండలాల నుంచి ఒక్కరు చొప్పున గట్టుప్పల్‌కు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విద్యుత్ శాఖకు ఏఈని నియమించారు. కార్యాలయం లేకపోవడంతో ఏఈ ఆరుబయటే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగదారులకు ఏఈకి ఇబ్బందులు తప్పడం లేదు. మిగిలిన శాఖలు ఏర్పాటు కాకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఏ మండల స్థాయి అధికారి ఆదేశాలు అమలు చేయాలో తోచక ఆందోళన చెందుతున్నారు. పూర్వ మండలాలకు వెళ్లి ప్రజలు పని చేయించుకోవాల్సి వస్తోంది. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గట్టుప్పల్ మండల కేంద్రంలో పూర్తి స్థాయిలో కార్యాలయాలు ఏర్పాటు చేయడంతోపాటు అధికారులకు పూర్తి అధికారాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి



గట్టుప్పల్ మండలంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. మండలం ఏర్పాటు జరిగి ఏడాది దాటినా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు చొరవ చూపలేదు. మండలం ఏర్పాటు అయితే ఇక్కడే పనులు అవుతాయి అనుకుంటే పాత మండలానికి పోక తప్పడంలేదు. త్వరగా అన్ని శాఖల కార్యాలయాలను ఇక్కడే ఏర్పాటు చేయాలి.

– మలిగె శ్రీశైలం, తేరట్‌పల్లి

అధికారుల దృష్టిలో ఉంది



గట్టుప్పల్ పోలీస్ స్టేషన్ గెజిట్ విషయం పోలీసు అధికారుల దృష్టిలో ఉంది. మండల కేంద్రంలో ఫిర్యాదు చేసుకుంటే ప్రస్తుతం పాత మండలాల పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేస్తున్నాం. త్వరలో అందరికీ అందుబాటులో అన్ని సేవలు అందుతాయి.

– వెంకటయ్య, సీఐ చండూరు

బాధ్యతారహితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు



ఓపెన్ ఫోరంలో మాట్లాడుతున్న ఏపీడీ

శాలిగౌరారం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసే సిబ్బంది విధులపట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.నవీన్‌కుమార్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉపాధిహామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ ఓపెన్‌ఫోరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో డిసెంబర్ 2021 నుంచి మార్చి 2023 వరకు రూ.5.66 కోట్ల వ్యయంతో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేసిన నివేదికలను ఓపెన్‌ఫోరంలో వెల్లడించారు. కార్యక్రమం అనంతరం ఏపీడీ వివరాలు వెల్లడించారు. మండలంలో 21 మంది సిబ్బంది నుంచి రూ.19 లక్షల రికవరీ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పలువురు సిబ్బందికి రూ. 21 వేలు జరిమానా విధించామని, అందులో కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.8వేలు విధించామన్నారు. ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లతోపాటూ క్లస్టర్ ఇంజనీర్, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ ఎండీ గౌరీ, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి గౌతమి, ఎస్సార్పీ రాజు, ప్లాంటేషన్ అధికారి ఎండీ మిస్కిన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుందరయ్య, ఎంపీఓ సుధాకర్, ఏపీఓ జంగమ్మ, క్లస్టర్ ఇంజనీర్ వెంకటాచారి, సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న నాయకులు

కేతేపల్లి: నకిరేకల్ ఎమ్మెల్యేగా వేముల వీరేశం విజయం సాధించడంతో కేతేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. టెంకాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. డీసీసీ కార్యదర్శి కోట పుల్లయ్య, జటంగి వెంకటనర్సయ్యయాదవ్, సైదులు, ఎడ్ల మహాలింగం, బోనగిరి మల్లయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ టౌన్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ నిబంధనలు సవరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులకు నెలకు రూ.3 వేల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, యల్లయ్య, శ్రీను, శంకరయ్య, జగన్, యాదగిరి, వినోద్, మహేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు